

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 5 ఏప్రిల్ 2025





సంఘటిత కార్యాచరణ కోసమే
ఉద్యోగ జేఏసీ

- ఉద్యోగ జేఏసీ కన్వీనర్, జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ 6



విద్యుద్దీపాల వెలుగులో భద్రాద్రి రామాలయం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం



భద్రగిరికి కల్యాణశోభ

- నేత్రపర్వంగా ధ్వజారోహణం
- నేడు ఎదుర్కోలు... రేపు కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు
- నవమి కల్యాణంలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి
- అధికారికంగా ఇంకా వెల్లడికాని పర్యటన షెడ్యూల్
- వాతావరణాన్ని చల్లబరిచేందుకు పొగమంచు యంత్రాల వాడకం

సమీపిస్తున్న సీతారాముల కల్యాణ గడియలు

భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల క్షేత్రం... శ్రీరామనవమి శోభను సంతరించుకుంది. ఎటు చూసినా స్వాగత ద్వారాలు... చలువ పందిళ్లు... చాందినీ వస్త్ర అలంకరణలు... దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న రామాలయ ప్రాంగణం... మొత్తంగా భద్రాచల రామక్షేత్రం భూలోక వైకుంఠంగా భక్తులకు దర్శనమిస్తోంది. ఎటు చూసినా సీతారాముల కల్యాణ పలుకులే. ఎవరి నోట విన్నా ఆది దంపతుల మాటే. ఆదివారం శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణం మిథిల స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు.

ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వైకుంఠ ద్వారం వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. నవమిని పురస్కరించుకొని పుణ్యక్షేత్రమైన భద్రాద్రిని వైభవంగా సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. రామాలయానికి విద్యుత్తు దీపాలంకరణలు, వెదురు పందిళ్లు, చాందినీ వస్త్రాలంకరణలు. స్వాగత ద్వారాలు, భక్తరామదాసు కీర్తనలు ఇలా పూర్తిగా భద్రాద్రి భక్తాద్రిగా మారిపోయింది. కల్యాణాన్ని తిలకించేందుకు (మిగతా 7వ పేజీలో)

24 సెక్టార్లు... 32 వేల మంది...

- మిథిల స్టేడియంలో కల్యాణ వేడుకకు ఏర్పాట్లు
- సెక్టార్ ప్లాన్ విడుదల చేసిన అధికారులు

7

రక్షణ వలయంలో భద్రాద్రి

- ఎస్పీ పర్యవేక్షణలో 1,800 మందితో బందోబస్తు
- సాయుధ పోలీసుల విస్తృత తనిఖీలు

7

వసతి లేక భక్తుల అవస్థలు

- ఆరుబయటే మకాం

7

ఎల్లుండి గవర్నర్ రాక

మహాపట్టాభిషేకం వేడుకకు హాజరు



భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సోమవారం నిర్వహించనున్న శ్రీసీతారామచంద్రస్వామి మహా పట్టాభిషేకం వేడుకకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారు. ఉదయం 9.40 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకొని 9.45కి భద్రాచలం బయలుదేరుతారు. 10.45కు భద్రాచలం చేరుకుంటారు. 10.50కి ఐటీసీ అతిథి గృహానికి చేరుకొని, 11 నుంచి 11.20 వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. 11.20కి రోడ్డు మార్గం ద్వారా వచ్చి రామాలయం చేరుకుంటారు. 11.30 నుంచి 11.40 వరకు స్వామి దర్శనం చేసుకుని 11.45కి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొంటారు. 11.45 నుంచి 12.45 వరకు పట్టాభిషేకం వేడుకను తిలకిస్తారు. 12.45కు మిథిల స్టేడియం నుంచి బయలుదేరి 1 గంటకు ఐటీసీ అతిథి గృహం చేరుకుంటారు. విరామం అనంతరం 1.25కి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.30కి హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారు. గవర్నరు వెంట ఆయన ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్‌తో పాటు 18 మంది అధికారులు, సిబ్బంది ఉంటారు.

అయోధ్యలా భద్రాద్రి
అభివృద్ధి

- కేంద్ర ప్రభుత్వం సహకరించాలి
- ఆగమ పండితులతో చర్చించిన తర్వాతే మాస్టర్ ప్లాన్
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి రెండు రోజుల్లో ఆమోదం
- సారపాక వరకు రైల్వేలైన్ పొడిగించాలి
- భద్రాద్రిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కరకట్ట పనులు ఇంకెంత కాలమని ఆగ్రహం



కరకట్ట వద్ద అధికారులతో మాట్లాడుతున్న తుమ్మల

భద్రాచలం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతదేశంలో అయోధ్య మాదిరిగా దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. భద్రాచలంలో శుక్రవారం ఆయన శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్షిం చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉందని ఈ క్రమంలో తొలి విడతగా భూ సేకరణ కోసం రూ.34 కోట్ల నిధులు విడుదల చేయగా వాటిని ఇంటి యజమానులకు అందజేయడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు అవసరమైతే అంత ఇచ్చేందుకు (మిగతా 7వ పేజీలో)

భక్తులను బంధువుల్లా చూసుకోవాలి...



- ఏర్పాట్లలో లోటుపాట్లు తలెత్తనివ్వద్దు
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల

7

అకాల వర్షంతో ఆగమాగం

- తడిసిన ధాన్యం, మొక్కజొన్న రాశులు
- గాలివానతో నేలవాలిన వరి
- 400 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా

ఖమ్మం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గురువారం రాత్రి అకాల వర్షం పడింది. సాయంత్రం వరకు మండే ఎండలతో తల్లడిల్లిన వాతావరణం రాత్రి ఒక్కసారిగా ఈదురుగాలులతో చల్లబడింది ఆకాశంలో మబ్బులు కమ్మి, వైరా, పెనుబల్లి, కల్లూరు మండలంలో అధికవర్షం పడగా మరికొన్ని మండలాల్లో జల్లులతో కూడిన వర్షం పడింది. దీంతో శుక్రవారం జిల్లా వాతావరణం చల్లబడింది. అకాలవర్షంతో కల్లాల్లోని ధాన్యం, మొక్కజొన్న, మిర్చి వంటి పంటలు తడిచి రైతులు కొంత నష్టపోయారు. అయితే కొద్దిసేపే వర్షం కురవడం, శుక్రవారం మళ్లీ ఎండ రావడంతో తడిచిన పంటను రైతులు ఆరబెట్టుకున్నారు.

వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు, కంకులు తడిసిపోయాయి. అలాగే పరిసర గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నలు, కొంత మిర్చి కూడా వర్షానికి తడిసిపోయాయి. భారీ ఈదురుగాలులతో ఒక్కసారిగా వైరాలో భారీ వర్షం కురిసింది. కొంతమంది రైతులు ఆరబోసిన మొక్కజొన్న కంకులు, మొక్కజొన్నలపై టార్పాలిన్ పట్టాలు కప్పినప్పటికీ



వైరాలో టార్పాలిన్ పట్టాలపై నిలిచిన వర్షపు నీరు



తిరుమలాయపాలెం మండలం వెదుళ్లచెరువులో తడిచిన మిర్చి

వర్షపు నీటితో అడుగుభాగంలో అవి తడిచిపోయాయి.

కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేలవాలగా, పలు చోట్ల ధాన్యం రాశులపై, అడుగు భాగం వర్షపు నీరు చేరింది. దీంతో ధాన్యం గింజలు తేమగా మారటంతో కల్లాల్లో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మండల పరిధిలోని కప్పలబంధం, చండ్రుపట్ల, బత్తుపల్లి, కల్లూరులోని పుల్లయ్యబంజర వీధివైపున, తదితర గ్రామాల్లో అకాల వర్షం, ఈదురు గాలి రావటంతో సుమారు 400 ఎకరాల్లో పంటకు ప్రాథమికంగా నష్టం వాటిల్లినట్టు అంచనా. పెనుబల్లి మండలంలో గురువారం రాత్రి అకాలంగా కురిసిన భారీ వర్షానికి మిర్చి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో మండాలపాడు, ఉప్పలచిలక, లింగగూడెం మొంగికుంట, చౌడవరం, ఏరుగట్ల, కారాయిగూడెం, బయ్యన్నగూడెం తదితర గ్రామాల్లో ఆరబెట్టిన మిర్చి తడిచిపోయింది. దీంతో మిర్చి తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు.

అలాగే సూరయ్యబంజర్, కోండ్రుపాడు, గణేశులపాడు, కుప్పెనకుంట్ల గ్రామాల్లో అకాల వర్షానికి వరిపైరు నేలకొరిగింది. కొన్ని గ్రామాల్లో కోసి ఆరబెట్టిన వరిధాన్యం కూడా తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రఘునాథపాలెం, చింతకాని, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో కూడా చిరుజల్లుతో వర్షం పడింది.



సీపీఆర్ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు

కాంగ్రెస్ నాయకుడికి గుండెపోటు

సీపీఆర్ చేసి కాపాడిన ఎమ్మెల్యే వెంకటరావు

దుమ్ముగూడెం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటనలో దుమ్ముగూడెం మండలం లచ్చిగూడెం కాంగ్రెస్ నాయకుడు తోటమళ్ల సుధాకర్ గుండెపోటుకు లోనవగా, అక్కడే ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు వెంటనే సీపీఆర్ చేసి అతని ప్రాణాలు కాపాడారు. ప్రాణాపాయం నుంచి బయటపడిన సుధాకర్‌ను వెంటనే స్థానిక (మిగతా 7వ పేజీలో)

తరుగు పేరుతో
కోత పెట్టొద్దు...

- ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల అక్రమాలను సహించం
- అలా చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం
- నవమి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో తరుగు పేరుతో కట్ చేస్తే మిల్లర్లను నేరుగా జైలుకు పంపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మిల్లర్లను తీవ్రంగా హెచ్చరించారు. నేలకొండపల్లి మండలంలో శుక్రవారం జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి తొలుత బోదులబండ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

అనంతరం జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ అధికారులు రైతుల పట్ల అలసత్వంతో ఉండవద్దని, నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించబోమని మంత్రి అన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం అర కేజీ కటింగ్ పెట్టినా, ఆ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని, జైలుకు పంపాలని మంత్రి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆర్థికంగా ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నామని, నవమి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



బోదులబండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి

ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. కట్టుకాచారంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, అనంతనగర్‌లో రూ.2కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్-స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో బోదులబండ సొసైటీ అధ్యక్షుడు అనంతు కాశయ్య, నాయకులు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, ఏఎంసీ చైర్మన్, షేక్.ఖాజామియా, బచ్చలకూరి నాగరాజు, బొడ్డు బొందయ్య, లక్కం ఏడుకొండలు, ఏటుకూరి చినపుల్లయ్య, చిట్టూరి అచ్చయ్య, ఏటుకూరి రామారావు, కట్టెకోల నాగార్జున, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి, తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీవో మర్రి యర్రయ్య, ఏఈ ఎలక్ట్రికల్ రామారావు పాల్గొన్నారు.

పోడు భూముల్లో
'పెద్దల' పాగా



- 'అశ్వారావుపేట' అటవీప్రాంతంలో 'నయా' సాగు
- బినామీ పేర్లతో గిరిజనేతర శ్రీమంతుల మాయ
- అటవీ సరిహద్దులను దాటి సాగు చేస్తున్నట్లు గుర్తింపు
- పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్న అశ్వారావుపేట తహసీల్దార్

6

పులకించిన జమలాపురం

- కనులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం
- తిలకించి పరవశించిన భక్తజనం
- రాత్రి పెద్దచెరువులో ఘనంగా తెప్పోత్సవం

ఎర్రుపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దివ్యక్షేత్రం జమలాపురం పులకించింది... ఆధ్యాత్మిక సౌరభాలతో గుబాళించింది... శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుక భక్తగణాన్ని తన్మయ భరితులను చేసింది. వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, వరపూజ, పాదప్రక్షాళన, మధుపర్కములు, యోక్త్రపూజ, మాంగళ్యపూజ నిర్వహించారు.

ఆకాశరాజు అల్లుడి వివాహానికి ఆకాశానికి సరితూగేలా ఖమ్మం నగరానికి చెందిన తూళ్లూరి కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు నూతనంగా నిర్మించిన వకుళమాత స్టేడియంలో గల కల్యాణ మండపాన్ని పచ్చని



మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న దృశ్యం

తోరణాలతో, రంగురంగుల పుష్పాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్టేడియం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేదపండితుడు పురాణం రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో సిరుల అలివేణి పద్మావతి అమ్మవార్లకు శ్రీవారు (మిగతా 7వ పేజీలో)



సంఘటిత కార్యాచరణ కోసమే ఉద్యోగ జేఏసీ ఏర్పాటు

» ఉద్యోగ జేఏసీ కన్వీనర్, జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ

ప్రశ్న: ఉద్యోగ సంఘాల జేఏసీ ఏర్పాటు లక్ష్యం?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గెజిటెడ్ అధికారులు ఉండి నాలుగో తరగతి ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారం కోసం సంఘటిత కార్యాచరణ కోసమే ఉద్యోగ జేఏసీ ఏర్పాటు చేశాం. ప్రభుత్వంనుంచి రావాల్సిన సౌకర్యాలు గురించి సంఘటితంగా పోరాడతాం

ప్ర: ఇప్పటికే ఆయా ఉద్యోగ సంఘాలు సమస్యలపై పనిచేస్తున్నాయి కదా?

జ: ప్రతి శాఖకు సంబంధించిన ఉద్యోగ సంఘం అధికారులతో పాటు ఉద్యోగుల వరకు అసోసియేషన్లు ఉన్నాయి. అయితే ప్రభుత్వం నుంచి కామన్ సమస్యల పరిష్కారం కోసం పించన్లు, ఈపీఎఫ్, డీఏ, పీఆర్సీ, బదిలీలు, పదోన్నతుల వంటి సమస్యలు అదరికి కామన్‌గా ఉంటాయి. వేర్వేరుగా సంఘాలనుంచి ప్రయత్నం చేయడం కంటే కామన్ సమస్యలపై అందరు కలిసి పోరాటం చేయడం ద్వారా ఒకేసారి సమస్యలు పరిష్కారం అవుతాయి.

ప్ర: జిల్లాలో ఎన్ని సంఘాలు, ఎంతమంది ఉద్యోగులు జేఏసీ కింద పనిచేస్తారు?

జ: జిల్లాలో అన్ని సంఘాలతోపాటు 46 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్ల వరకు అందరు కలిసే జేఏసీ కింద పనిచేయడం జరుగుతుంది. ఇందులో ఎలాంటి వ్యత్యాసాలుండవు. కాంటాక్టు ఉద్యోగుల సమస్యలపై కూడా జేఏసీ పనిచేస్తుంది. రాష్ట్ర జేఏసీకి అనుబంధంగా అన్ని జిల్లాల్లో జేఏసీలు పనిచేస్తాయి. ప్రతి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూడా ఇందులో కో చైర్మన్‌గా వ్యవహరించడం జరుగుతుంది.

ప్ర: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులూలు మీ జేఏసీలో ఉంటున్నారా?

జ: కేంద్ర ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులను, అధికారులను మా జేఏసీలో కలుపుకోవడంలేదు. వారి సమస్యలు, డిమాండ్లు వారి పీఆర్సీలన్నీ వేరుగా ఉంటాయి. అందువల్ల మేము కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను కలుపుకోవడంలేదు.

ప్ర: ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చిన తక్షణ సమస్యలేంటి? అందుకు చేస్తున్న ప్రయత్నాలు?

జ: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు సంబంధించి డీఏ, పీఆర్సీ, వంటి సమస్యలతోపాటు హెల్త్‌కార్డు సమస్యలు, ప్రమోషన్లు, బదిలీల సమస్యలు కూడా ఇంకా ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు, అధికారుల సమస్యలపై డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

పోడు భూముల్లో 'పెద్దల' పాగా

'అశ్వారావుపేట' అటవీ ప్రాంతంలో 'నయా' సాగు

» బినామీ పేర్లతో గిరిజనేతర శ్రీమంతుల మాయ
» విచ్చలవిడిగా బోర్లు, విద్యుత్ కనెక్షన్లు
» పదేళ్ల క్రితం అది పెద్ద అటవీ ప్రాంతం
» ఇప్పుడు పెద్ద ఎత్తున వాణిజ్య, ఉద్యాన పంటల సాగు
» అటవీ సరిహద్దులను దాటి సాగు చేస్తున్నట్లు గుర్తింపు
» పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్న అశ్వారావుపేట తహసీల్దార్



వినాయకపురం అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ బౌండరీ పోల్స్‌ను దాటి భూ ఆక్రమణలు చేసి పంటలు వేసిన దృశ్యం

అటు అటవీశాఖాధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు ఉలిక్కిపడే వ్యవహారం భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అశ్వారావుపేట మండలం వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వెనుక జమ్మిగూడెం వైపు ఉన్న ప్రాంతం పదేళ్ల క్రితం భారీ వృక్షాలతో అటవీ ప్రాంతంగా ఉండేది. ఇది అశ్వారావుపేట నుంచి భద్రాచలం వైపు వెళ్లే ప్రధాన రహదారికి కిలో మీటరు దూరంలోనే ఉంటుంది. పదేళ్ల క్రితం దట్టమైన అడవిగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు కార్పొరేట్ స్థాయి వ్యవసాయంతో కోనసీమను తలపిస్తోంది.

అశ్వారావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ సుమారు 200ఎకరాల అడవి మాయమైపోయింది. విచ్చలవిడిగా చెట్లను నరికి ఆ ప్రాంతాన్ని సాగులోకి తెచ్చారు. ఈ భూముల్లో పైకి గిరిజనుల పేర్లు చూపుతున్నా కొందరు శ్రీమంతులే వారి పేర్లతో ఇక్కడ తిష్ట వేసినట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న భూ అభివృద్ధి, సాగు తీరును పరిశీలిస్తే గిరిజనులకు ఆ స్థాయిలో సాగు చేసే స్తోమత ఉండదనే విషయం స్పష్టమవుతోంది. కొందరు గిరిజనేతరులు, శ్రీమంతులు ఒక్కొక్కరు 40 నుంచి 50 ఎకరాలు చెరపట్టి కార్పొరేట్ వ్యవసాయం సాగిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూముల్లో ఆంధ్రా, ఇతర ప్రాంతాలకు చెందిన వారితో పాటు కొందరు రెవెన్యూ, అటవీశాఖకు చెందిన ఉద్యోగులు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అటవీ ప్రాంతంలో జరుగుతున్న సాగును పరిశీలిస్తున్న అటవీ అధికారులు

హద్దులను దాటి మరీ...

వివిధ రకాల ఉద్యాన పంటలు, వాణిజ్య పంటలతో ఈ ప్రాంతం కోనసీమను తలపిస్తోంది. విచ్చలవిడిగా బోర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. అక్కడ కల్పించిన సౌకర్యాలు, చేపట్టిన సాగుపై ఎవరికి అభ్యంతరాలు లేకపోయినా పదేళ్ల క్రితం లేని రైతులు ఇప్పుడెలా ఎలా వచ్చారు? సదరు రైతులకు ఆ భూములు ఎలా వచ్చాయన్న విషయంపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటవీశాఖ వేసిన బౌండరీ పోల్స్ దాటి సాగు చేస్తుంటే అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.వందల కోట్ల విలువ చేసే ఈ అటవీ ప్రాంత భూముల్లో పోడు పట్టాలను అడ్డుపెట్టుకొని సాగు చేస్తున్నారేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ భూముల వ్యవహారం వెలుగులోకి రావడంతో దమ్మపేట అటవీ రేంజర్ కరుణాకరాచారి గురువారం ఆ ప్రాంతాన్ని సందర్శించి భూములను పరిశీలించారు. కొంత మంది రైతులు అటవీశాఖ బౌండరీలు దాటి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా సాగులోకి తెచ్చిన అటవీ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. మిగతా భూమి తమ సరిహద్దులకు బయట ఉందని, అయినా వాటిని సర్వే చేస్తే కాని స్పష్టత రాదని తెలిపారు. దీనిపై అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా ఈ రోజే ఈ భూముల విషయం తన దృష్టికి వచ్చిందని, సిబ్బందిని పంపించి పూర్తి వివరాలు సేకరిస్తామన్నారు. జాయింట్ సర్వే చేసి, ఆ భూములు ఎవరివో తేలుస్తామన్నారు.

సమగ్ర విచారణతోనే స్పష్టత..

ఇదిలా ఉండగా గురువారం ఈ భూముల వద్దకు వెళ్లిన కొందరు విలేకరులకు అక్కడున్న కొందరు గిరిజనులు తమ వద్ద ఉన్న పట్టాలు చూపించినట్లు తెలుస్తోంది. నిజంగానే గతంలో ఈ భూములకు పట్టాలున్నాయా? లేక గడిచిన పదేళ్లలో ఈ భూములను అభివృద్ధి చేసిన తరువాత పట్టాలు వచ్చాయా? పట్టాల్లో ఉన్న రైతులే క్షేత్రస్థాయిలో ఉన్నారా? గతంలోనే పట్టాలుంటే అటవీశాఖ, రెవెన్యూ అధికారులు అవి ఫలానా భూములని ఎం దుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అక్కడ అటవీ, రెవెన్యూ సిబ్బందికి భూములున్నాయన్న ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి. ఇటీవలే ఉద్యోగ రీత్యా వచ్చిన వీరికి ఆ భూములు ఎలా వచ్చాయనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని పలు గిరిజన సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్నారు.

19 నుంచి గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని సీఐటీయూ అనుబంధ కార్మికులు శుక్రవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వివరించారు. కలెక్టరేట్‌లో ఆయనను కలిసి తమ సమస్యలను వినతిపత్రం ద్వారా ఏకరువు పెట్టారు. పంచాయతీ కార్మికులు గత కొన్ని ఏళ్లుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నా ఏళ్లతరబడి చాకిరీ చేస్తున్నా కనీసం క్రమబద్ధీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోని కారణంగా ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్టు వారు కలెక్టర్‌కు వివరించారు. సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు. గ్రీన్ చానల్ ద్వారా వేతనం (జీతాలు రానున్నట్టు తెలిపినట్టు నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్షుడు వి.సుధాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె నాగరాజు, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు పి.లాలయ్య, కారేపల్లి మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్, ,కొణిజర్ల మండల కార్యదర్శి నరేష్, ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు నాగేశ్వరావు ధర్మేందర్ తదితరులున్నారు.

హస్తానికి ప్రత్యామ్నాయం కమలమే

» ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం » మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ధర్మారావు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హస్తానికి ప్రత్యామ్నాయం బీజేపీ అని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరిచిపోతున్నారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో సరఫరా చేసే రేషన్ బియ్యానికి మరో కిలో కలిపి రాష్ట్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తున్నట్టు ప్రగల్భాలు పలుకుతున్నారని కరోన సమయం నుంచి 90లక్షల మంది ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో 49లక్షల పైచిలుకు ఆన్‌లైన్ సభ్యత్వాలు, 41వేల పైచిలుకు క్రియాశీలక సభ్యత్వాలతో పెద్దపార్టీగా బీజేపీ రూపాంతరం చెందుతోందని, ఆరు హామీల్లో రైతు భరోసా కనుమరుగైందని, కల్తీ విత్తనాలు, ఎరువులతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అదేవిధంగా రూ.4వేల పింఛన్ అటకెక్కిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ గాలికి వదిలేశారన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమి దండుకుని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి కమీషన్ల ద్వారా కోట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. అనంతరం నూతన బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నెల్లూరి కోటేశ్వరరావును శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సన్నె ఉదయ్‌ప్రతాప్, గంటేల విద్యాసాగర్, రవికుమార్, రవీందర్, సుధాకర్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, రవి, తక్కెళ్లపల్లి నరేందర్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

నాటితరం ఫొటో గ్రాఫర్ కన్నుమూత



సత్యనారాయణ

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నాటితరం ఫొటో గ్రాఫర్ చింతల సత్యనారాయణ (64) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య విజయలక్ష్మీ, ఇద్దరు పిల్లలున్నారు. ఖమ్మం రైల్వే గేట్ సమీపంలో తన తండ్రి రాఘవరావు ఫోటో స్టూడియో 70 ఏళ్లక్రితం ప్రారంభించారు. శ్రీనివాసరావు పుట్టిన తర్వాత ఆ స్టూడియోకి శ్రీనివాస ఫోటో స్టూడియోగా మార్చి నిర్వహించారు. ఖమ్మం నగరంలో స్టేషన్‌రోడ్డులో ప్రముఖ స్టూడియోతో పాటు శ్రీనివాసఫోటో స్టూడియో ఎంతో పేరుంది. ఫొటోగ్రఫీ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం కలర్‌ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వైరా రోడ్డు రాఘవ డిజిటల్స్ పేరుతో స్టూడియో నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరావు సోదరులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు. సత్యనారాయణ, ప్రసాద్ ఖమ్మంలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌గా కూడా పనిచేశారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయురాలి మృతి

ఇల్లెందుటౌన్: ఇల్లెందు 21పిట్ ప్రధానోపాధ్యాయులుగాపని చేస్తున్న ఆవుదుర్తి యాదమ్మ (59) శుక్రవారం ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న యాదమ్మ శుక్రవారం అకస్మాతుగా మృతి చెందారు. యాదమ్మ మృతి పట్ల వివిధ ఉపాధ్యాయ సంఘాలు సంతాపం ప్రకటించాయి.

భద్రాద్రిలో జిల్లాలో కుష్ఠుపై సర్వే పూర్తి

» 2,88,368 ఇళ్ల పరిశీలన
» 2,13,576 మందికి పరీక్షలు
» అనుమానితులు 1,702 మంది
» డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

చుంచుపల్లి,ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో కుష్ఠువ్యాధిపై సర్వే పూర్తి అయింది. 1702 మంది వ్యాధి అనుమానితులను గుర్తించారు. ఈ వివరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ శుక్రవారం తెలిపారు. గత నెల మార్చి17 నుంచి 30వరకు జాతీయ స్థాయిలో కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమ సర్వేను నిర్వహించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ వ్యాధి లక్షణాలున్న వారి వివరాలను నమోదు చేశారని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. జిల్లాలోని సర్వేలో భాగంగా 288368 ఇళ్లను సందర్శించి 2,13,576 మందిని పరీక్షించామని చెప్పారు. ఈ సర్వేలో రెండు పీబీ, మూడు ఎమ్‌బి కేసులు కొత్తగా కనిపెట్టి మందులు అందజేశామన్నారు. శరీరంపైన స్పర్శ లేని మొద్దు భారిన రాగి వర్ణంలో ఉన్న వారిని, తిమ్మిర్లు ఉండి చేతులు, కాళ్లు వంకరగా వంగడం వంటి వాటిని పరిశీలించినట్లు పేర్కొన్నారు. చెమట పట్టకపోవడం ,దేనినైనా తాకినప్పుడు స్పర్శ జ్ఞానాన్ని కోల్పోయి ఉండి శరీరం మద్దుబారిపోయి ఉండడం, పాదాలు, అరిచేతులు తిమ్మిరిగా ఉండడం, గాయాలు తగ్గకపోవడం తదితర లక్షణాలు ఉంటే వ్యాధి లక్షణాలుగా అనుమానించాలన్నారు.

తొలిదశలో నివారణ సాధ్యం

ప్రారంభ దశలో చికిత్స పొందితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. లక్షణాలు బయటపడడానికి రెండు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు సమయం పట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ వ్యక్తిగత వ్యాధి నిరోధక శక్తి మీద ఆధారపడి ఉంటుంది. శరీరంపై ఐదు కంటే ఎక్కువగా మచ్చలు ఉంటే ఎంబి, శరీరంపై ఐదు మచ్చల కంటే తక్కువగా ఉంటే దానిని పీబీ కేసుగాను గుర్తించినట్లు తెలిపారు. ఐదు మచ్చల కంటే తక్కువ ఉంటే ఆరు నెలల చికిత్స, ఐదు మచ్చల కంటే ఎక్కువగా ఉంటే 12నెలల చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. దీనికి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు అందిస్తామన్నారు. జిల్లాలో ఎవరికైనా కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే దగ్గరలోనే ఆరోగ్య కేంద్రంలో చూయించుకోవాలన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, ఫిజియోథెరపిష్ట్ జి.భద్రు, డిప్యూటీ డెమో ఫైజ్ మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అనుమానితులను పరిశీలిస్తున్న అధికారులు

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) పురుగు మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం ఆళ్లపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ఆళ్లపల్లి మండలం, రాఘవాపురం పంచాయతీ, కర్నెగూడెం గ్రామానికి చెందిన కొమరం నర్సింహరావు(37) అతిగా మద్యం తాగాడు. ఇంట్లో గొడవ చేయడంతో భార్య మందలించింది. దాంతో నర్సింహరావు క్షణికావేశంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి రిమాండ్‌కు పంపినట్లు ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్1 సీఐ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం ఖమ్మంలోని జయశంకర్ ఫ్లైఓవర్ వద్ద ఎక్సైజ్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చర్చికాంపౌండ్‌కు చెందిన హనోక నాగుల్ అనే వ్యక్తి ద్వి చక్రవాహనంపై వెళుతున్నాడు. అతడిని తనిఖీ చేయగా 650గ్రాముల ఎండు గంజాయిని గుర్తించారు. విచారణ అనంతరం ద్వి చక్రవాహనం సీజ్ చేశారు. నిందితుడ్ని రిమాండ్ చేసినట్లు ప్రకటించారు.

మడుపల్లిలో దొంగల హల్‌చల్

» రెండు వైన్‌షాపుల్లో నగదు చోరీ
» ఫెర్టిలైజర్ గోడౌన్‌లో చోరీకి యత్నం

మధిరరూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో గురువారం అర్ధరాత్రి తర్వాత దొంగలు హల్‌చల్ చేశారు. రెండు వైన్‌షాపుల్లో చొరబడి నగదు ఎత్తుకుపోవడంతోపాటు మరో ఫెర్టిలైజర్ గోడౌన్‌లో చోరీకి యత్నించారు. మడుపల్లి గ్రామంలోగల లక్ష్మీశ్రీనివాస, మురళీకృష్ణ వైన్‌షాపుల్లో అర్ధరాత్రి తర్వాత దొంగలు చొరబడ్డారు. ఈ రెండు షాపుల పైభాగాన రేకులను పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. లక్ష్మీశ్రీనివాస వైన్‌షాపులో రూ.25వేల నగదు, మురళీకృష్ణ వైన్‌షాపులో రూ.60వేల నగదు అపహరించుకుపోయారు. దొంగలు లోపలకు ప్రవేశించింది షాపుల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఆతర్వాత వైన్‌షాపుల సమీపంలో ఉన్న ఫెర్టిలైజర్ గోడౌన్ తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. గ్రామంలో మూడుచోట్ల దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. టౌన్ పోలీసులు చోరీ జరిగిన షాపులను పరిశీలించారు.



వైన్‌షాపు పైభాగాన రేకులు పగులగొట్టిన దృశ్యం

లారీ ఢీ.. యువకుడి దుర్మరణం

దమ్మపేట, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పట్వారిగూడెం చింతలవాగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం... దమ్మపేట అర్బన్ కాలనీకు చెందిన గాజుబోయిన ప్రశాంత్(19) టాపీ పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. కొత్తగూడెంలో టాపీ పని ఉందని తల్లికి చెప్పి శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్లాడు. పని ముగించు కొని దమ్మపేటకు తిరిగి వచ్చే క్రమంలో పట్వారీగూడెం గ్రామ సమీపంలో పాల్వంచ వైపు వెళుతున్న లారీ వేగంగా వస్తూ అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రశాంత్ తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్త స్రావం కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి గాజుబోయిన శాంతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.



ప్రశాంత్ (ఫైల్)

రేషన్ బియ్యం పట్టివేత

అశ్వాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. గొల్లగూడెం సీతారామా కెనాల్ సమీపంలో కొందరు ట్రాలీ ఆటోద్వారా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అశ్వాపురం ఎస్ఐ రవూఫ్ తనిఖీలు నిర్వహించారు. 25 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. ట్రాలీ ఆటోను స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేశారు.

పూరిల్లు దగ్ధం

ములకలపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పూసుగూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చల్లా రామకృష్ణకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చల్లా రామకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

ఇద్దరు విలేకర్లపై కేసు నమోదు

జూలూరుపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చికెన్ షాపు యాజమానిని డబ్బులు ఇవ్వాలని బెదిరించిన ఇద్దరు విలేకర్లపై శుక్రవారంరాత్రి జూలూరుపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై బాదావత్ రవి వివరాల ప్రకారం.. మండలంలోని జూలూరుపాడు గ్రామానికి చెందిన కంచపోగు నరసింహారావు, వెంగన్నపాలెం గ్రామానికి చెందిన తంబర్ల నరసింహారావు జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఓ చికెన్ షాపు వద్దకు వెళ్లారు. యాజమాని బోడా శ్రీనుని బెదిరింపులకు గురిచేశారు. తాము విలేకర్లమని చెప్పి సెల్‌ఫోనులో వీడియోలు తీస్తూ రూ.10వేలు ఇవ్వాలని లేకపోతే చనిపోయిన, పురుగులు పడ్డ, రోగాలతో ఉన్న కోళ్లను అమ్ముతున్నావని కథనాలు రాస్తామని, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. యాజమానిని బయటకు రానియకుండా చేశారు. దీంతో వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని యాజమాని ఫిర్యాదు చేయటంతో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ దర్యాప్తు ప్రారంభించారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై కేఎంసీ కొరడా

» ప్రముఖ రెస్టారెంట్ ఎదుట షామియానాల తొలగింపు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పాదచారుల కోసం నిర్మాణం చేసిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఇష్టారీతిగా వినియోగిస్తున్నారు. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సీరియస్‌గా ఆదేశాలు జారీ చేశారు. చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు, హోటల్స్, రెస్టారెంట్లు తేడా లేకుండా ఖమ్మం డీఆర్‌ఎఫ్ సిబ్బంది దాడులు చేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం ప్రధాన రహదారి వెంట ఉన్న హావేలి రెస్టారెంట్‌పై డీఆర్‌ఎఫ్ బృందాలు దాడులు చేశాయి. ఫుట్‌పాత్ పై అక్రమంగా నిర్మాణం చేసిన షామియానాలను తొలగించారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో బడా వ్యాపారులపై కేఎంసీ అధికారులు చూసి చూడని తీరుగా వ్యవహరిస్తారనే ఆరోపణలు తొలగిపోయాయి.

రక్షణ వలయంలో భద్రాద్రి

- ఎస్పీ పర్యవేక్షణలో 1,800 మంది సిబ్బందితో బందోబస్తు
- సాయుధ పోలీసుల విస్తృత తనిఖీలు

భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భద్రాచలంలో పోలీసు శాఖ కనీవిని ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎస్పీ రోహిత్‌రాజు పర్యవేక్షణలో 1800 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. ఆదివారం శ్రీరామనవమి నాడు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, న్యాయమూర్తులు, ఇతర సీనియర్ అధికారులు రానుండటంతో బందోబస్తుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం పోలీసు సిబ్బంది అంతా భద్రాచలం చేరుకున్నారు. వీరి కోసం పోలీసు స్టేషన్ ప్రాంగణం, తానీషా కల్యాణ మండపంతో పాటు పలు చోట్ల వసతి ఏర్పాటు చేశారు. బందోబస్తుకు నవమి/పట్టాభిషేకానికి ఎడిషనల్ ఎస్పీ ఒకరు , 16 మంది డీఎస్పీలు, 66 మంది సీఐలు, 185 ఎస్సైలు, 304 మంది ఏఎస్సై/హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 555, మహిళా ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, 208, హోంగార్డు 404లతోపాటు, ఆర్మ్‌డ్ రిజర్వుడు సెక్షన్లు, బాంబ్ డిస్పోజబుల్ బృందాలతో బందోబస్తు నిర్వహించనున్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు కలిగిన భద్రాచలంలో కల్యాణం, శ్రీరామ మహా పట్టాభిషేకంను పురస్కరించుకొని పోలీసులు కల్యాణంకు 40 గంటలముందు నుంచే భద్రాచలం చేరుకునే అన్ని మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రతి వాహనంను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బ్రిడ్జి రోడ్డు, కూనవరం, చర్ల రహదారులతో పాటు ఆర్టీసీ బస్‌స్టాండు, అన్ని లాడ్జిలు, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్వామి వారి కల్యాణం జరిగే కల్యాణ మండపం పూర్తిగా పోలీసుల భద్రతా వలయంలో ఉండనుంది. కల్యాణ మండపం మొత్తం డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ బృందాలతో అణువణువు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే రామాలయంలో తూర్పు, పడమర మెట్లవైపు ఉన్న ప్రవేశ ద్వారాల వద్ద భక్తులను తనిఖీలు నిర్వహిస్తున్నారు.

అద్భుతం.. శిల్పకళాశోభితం

కల్యాణ మండపం



రాములోరి కల్యాణాన్ని మిథిల స్టేడియంలో శిల్పకళా శోభితమైన మండపంలో నిర్వహిస్తారు. ఈ కల్యాణ మండపానికి 1960 మే 30న అప్పటి దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి శంకుస్థాపన చేయగా 1964 ఏప్రిల్ 6న నీలం సంజీవరెడ్డి కల్యాణ మండపాన్ని ఆవిష్కరించారు.
-ఆంధ్రజ్యోతి, భద్రాచలం

వైభవంగా ధ్వజారోహణ

దుమ్ముగూడెం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వారి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయం లో శుక్రవారం ధ్వజారోహణను వైభవంగా నిర్వహించారు. తొలుత విశ్వక్సేన అరాధన, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్టాపనం, చతుఃస్థానార్చన, నిత్యా పూర్ణాహుతి, బలిపీఠాల ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సంతానం లేని వారికి గరుడ ప్రసాదాన్నందజేశారు. అర్చకులు ప్రతాపం భార్గవాచార్యులు, కారంపూడి కిరణ్‌కుమారాచార్యులు, వెంకటాచార్యులు, భదర్వాజచార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహచార్యులు పూజలు నిర్వహించగా, ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రికే దక్కిన 'పద్మశ్రీ' గౌరవం



షేక్ హసన్ సాహెబ్

భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి తొలి నాదస్వర విద్వాంసుడు షేక్ హసన్ సాహెబ్‌కు కేంద్ర ప్రభుత్వం మరణానంతరం ప్రకటించింది. 2022 మార్చి 21న హసన్ సాహెబ్ మనవడు షేక్ హీలాంషావుద్దీన్ పద్మశ్రీ పురస్కారం స్వీకరించారు. దేవాదాయ శాఖలో ఈ విధంగా పద్మశ్రీ పురస్కారం అందుకున్న ఏకైక నాదస్వర విద్వాంసులు షేక్ హసన్‌సాహెబ్ కావడం విశేషం. దీంతో భద్రాచలానికే పద్మశ్రీ పురస్కార గౌరవం దక్కినట్లయింది.

24 సెక్టార్లు.. 32 వేల మంది..

- మిథిల స్టేడియంలో కల్యాణవేడుకకు ఏర్పాట్లు ముమ్మరం
- సెక్టార్ ప్లాన్ విడుదల చేసిన అధికారులు



సెక్టారు ప్లాన్

భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం మిథిల స్టేడియంలోని శిల్పాకళా శోబితమైన కల్యాణ మండపంలో సీతారామాచంద్ర స్వామికి కల్యాణం నిర్వహించనున్నారు. దీంతో దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇందుకు అవసరమైన ఏర్పాట్లను స్టేడియం ప్రాంగణంలో చేశారు.ఇందుకోసం సెక్టార్ ప్లాన్ రూపొందించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు రా ష్ట్ర మంతులు ,ఎంపిలు,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు రానున్నారు. అలాగే న్యాయమూర్తులు , సీనియర్ ఐఏఎస్ , ఐపీఎస్ అధికారులు తోపాటు ఇతర ప్రముఖులు రానుండటంతో అందుకు అనుగుణంగా వీరి కోసం ప్రత్యేక సెక్టార్ల రూపకల్పన చేశారు. దేవస్థానం అధికారులు విక్రయించిన కల్యాణ టికెట్ల ఆధారంగా సెక్టార్లను రూపొందించారు. ఈక్రమంలో మిథిల స్టేడియంలో మొత్తం 24 సెక్టార్లు ఉండగా 31,860 మంది స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు అవకాశముంది. ఇందులో 16,860 మంది టికెట్లు కొనుగోలు చేసి స్వామి వారి కల్యాణం తిలకించేందుకు అవకాశముండగా స్టేడియం పై బాగంలో ఉన్న గ్యాలరీ ద్వారా 15,000 స్వామి వారి కల్యాణాన్ని ఉచితంగాతిలకించే అవకాశముంది. ఇదిలా ఉండగా అత్యవసర 20 ద్వారాలు ద్వారా భక్తులకు బయటకు వెళ్ళేందుకు అవకాశముండగా, 9 ద్వారాల నుంచి లోపలికి ప్రవేశించేందుకు 4 ద్వారాలు నుంచి బయటకు వెళ్ళేందుకు అవకాశముంది.సెక్టార్ల పనులు పూర్తయిన అనంతరం ట్రాన్స్‌కో , అగ్నిమాపక శాఖ అధికారుల నుంచి దేవస్థానం అధికారులు ఎటువంటి ఇబ్బందులు లేవని ధృవీకరణ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంది.

ఉదయం 6 గంటలకే

విధులకు హాజరు కావాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాచలం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి, పట్టాభిషేకానికి వివిధ సెక్టార్లలో విధులు నిర్వహించే అధికారులు ఉదయం 6 గంటల వరకు తమ విధుల్లో చేరాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టరు సమావేశ మందిరంలో విధులు కేటాయించిన లైజన్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీఐపీ, వీవీఐపీలు వారి సెక్టార్లలో కూర్చొనే విధంగా ఉండాలని, వృద్ధులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లను, అనారోగ్యంతో ఉన్నవారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఐపీ, వీవీఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా గొడవలకు దిగితే పోలీసు సహకారం తీసుకొని గొడవలు కాకుండా చూడాలని, దేవుని దగ్గర అందరం సమానమే అని వారికి నచ్చజెప్పాలని అన్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని, లైజన్ ఆఫీసర్ల పర్యవేక్షణ చాలా పకడ్బందీగా ఉండాలని, సెక్టరల్ అధికారులు మీ సిబ్బందిని అప్రమత్తంగా చేసి భకుత్లకు సహాయ సహకారాలు అందించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ వేణుగోపాల్, పీవో బి.రాహుల్, డీఆర్‌డీవో విద్యాచందన, ఆర్డీవో దామోదర్‌రావు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్‌వి పాటిల్ నవమి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమయంలో పొగమంచు ట్రయల్ రన్‌ను సైతం ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

వసతి లేక భక్తుల ఇక్కట్లు



రహదారిపై సేదదీరుతున్న భక్తులు

భద్రాచలం ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం ఆదివారం నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం భద్రాచలం చేరుకున్న రామభక్తులకు సేద తీరేందుకు వసతి లేక ఇక్కట్లకు గురవుతున్నారు. భద్రాచలంచ, పాల్వంచ, కొత్తగూడెంలలో ప్రభుత్వ ప్రవేటు వసతి గృహాలు లాడ్జీలు జిల్లా ఆదికార యంత్రాంగం పరిధిలోకి వెళ్లడంతో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. రామయ్య కళ్యాణాన్ని తీలకించేందుకు వచ్చే మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖాలకు చెందిన సీనియర్ ఆదికారులు వసతి గృహలను కేటాయించడంతో భక్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం.

భద్రాద్రికి 197 ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న జరగనున్న శ్రీరామనవమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని రీజనల్ మేనేజర్ సరిరాం శుక్రవారం తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో ఈ ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు.

మొత్తం రీజియన్ పరిధిలో భద్రాచలంకు 197 ప్రత్యేక బస్సులను నడుపుతుందని తెలిపారు. భద్రాచలం నుంచి పర్ణశాలకు 30 బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. మహాలక్ష్మీ పథకం నేపథ్యంలో రాములవారి కళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటటి రవాణా సమస్యలు తలెత్తకుండ ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

హైద్రాబాద్ నుంచి భద్రాచలంకు 70 బస్సులు, భద్రాచలం నుంచి ఖమ్మంకు రోజువారి సర్వీసులు కాకుండా అదనంగా మరో 35 సర్వీసులు, భద్రాచలం నుంచి కొత్తగుడెంకు 10 బస్సులు అదనంగా, భద్రాచలం నుంచి మణుగురుకు 10 బస్సులు, సత్తుపల్లికి 17 బస్సులు, ఇల్లెందుకు 5 బస్సులు అదనంగా ఏర్పాటు చేశామని తెలిపారు. వీటితోపాటు భద్రాచలం నుంచి విజయవాడ, రాజమండ్రి, గుంటూరు, ఏలూరు, కాకినాడ, అమలాపురం వైపు వెళ్లే బస్సులు జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుంచి బయలుదేరుతాయని తెలిపారు.

అక్కడ నుంచి ఆలయానికి ప్రత్యేకంగా రెండు బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. మరిన్ని వివరాలకు భద్రాచలం డిపో 9959225987, ఖమ్మం నూతన బస్టాండ్ 9959225979, మణుగురు 8985361796, కొత్తగుడెం 9959225982 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

భక్తులను బంధువులుగా..

చూసుకోవాలి: తుమ్మల



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల

భద్రాచలం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి, పట్టాభిషేకానికి వచ్చే భక్తులను మీ బంధువులుగా భావించి అన్ని రకాల ఏర్పాట్లు లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా అధికారులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. భద్రాచలంలోని సబ్‌కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీరామ నవమి, పట్టాభిషేకం ఏర్పాట్లపై శుక్రవారం అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కల్యాణ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు వస్తున్నందున వీవీఐపీ, వీఐపీ, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి అందరూ కల్యాణం తిలకించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, బందోబస్తు, సెక్టార్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి నిలిపి బందోబస్తును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు సెక్టార్లలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలని, పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఏడు చోట్ల డ్రమ్ములను ఉంచి తాగునీటి సౌకర్యకం కల్పిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.

స్వామి వారి తలంబ్రాల పంపిణీకి 80 కౌంటర్లు, లడ్డూల సరఫరాకు 19 కౌంటర్లు సిద్ధం చేశామని, ప్రతి రోజు లక్షన్నర లడ్డూలకు భక్తులకు అందించేలా చర్యలు తీసుకున్నామని, ఈ సంవత్సరం భక్తులకు తలంబ్రాల కొరత లేకుండా 200 క్వింటాళ్లు తయారు చేసి సిద్ధంగా ఉంచామని వివరించారు. అలాగే సీఎం రాక కోసం సారపాక, భద్రాచలంలో మూడు చోట్ల హెలిప్యాడ్‌లను సిద్ధం చేశామన్నారు. విద్యుత్తు సమస్య లేకుండా చూసుకోవాలని, అవసరమైతే 500 కెపాసిటీ గల జనరేటర్ అందుబాటులో ఉంచాలని, గోదావరి ఒడ్డున బారికేడింగ్, గజ ఈతగాళ్ల, స్త్రీలు బట్టలు మార్చుకునే షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. హోటళ్లలో నాసిరకం పదార్థాలతో వండకుండా ముందస్తుగా ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు తనిఖీ చేయాలని, అగ్నిమాపక శాఖ ఫైరింజన్లు కల్యాణ మండపం, ముఖ్యమైన ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావు పాల్గొన్నారు.

భద్రగిరికి కల్యాణ శోభ

(5వ పేజీ తరువాయి)

వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రామయ్య సన్నిధికి చేరుకుంటున్నారు.

కాగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు రానున్నారు. ఇందుకోసం హెలిప్యాడ్‌లను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఎదుర్కోలు, శ్రీరామనవమి, మహా పట్టాభిషేకంలను పురస్కరించుకొని స్వామివార్లను తీసుకెళ్లే మార్గంలో దేవస్థానం, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పరిశీలించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ 1800 మందికి పైగా సిబ్బందితో బందోబస్తును పటిష్టవంతంగా చేపట్టింది.

కాగా దేవస్థానం ఆద్వర్యంలో రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. 26 కౌంటర్ల ద్వారా లడ్డూ ప్రసాద విక్రయాలు 80 కౌంటర్ల ద్వారా నవమి కళ్యాణ తలంబ్రాల పంపిణీ చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా కల్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించగా 32 వేల మంది భక్తులు ప్రత్యక్షంగా తిలకించనున్నారు. కాగా ఇందులో 15000 మంది భక్తులు ఉచితంగా స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు వీలుంది. కల్యాణ మండపం ప్రాంగణంలో 50 టన్నుల ఏసీ, వంద కూలర్లు, 250 ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు.

నేత్రపర్వంగా ధ్వజారోహణం

తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం నేత్రపర్వంగా సాగింది. శ్రీ మహావిష్ణువు ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపటాన్ని ఈ సందర్భంగా ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఇప్పటి నుంచి పూర్ణిమ నాటి వరకు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు దేవతలకు, ఇటు మానవులకు తెలిపే విధంగా ఈ ధ్వజారోహణ జరుపుతారు. అలాగే అష్టదిక్పాలకులు, పంచలోక పాలకులు, దేవతలకు ఆహ్వానించే బేరిపూజ కార్య క్రమాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత ఆయా దేవతలకు ఇష్టమైన ప్రసాదాలను అర్పించి బ్రహ్మోత్సవాలు జరిగినన్నాళ్లు ఆలయంలో ఉండి స్వామిని దర్శించే భక్తులకు శుభాలు కలిగేలా దీవించాలని కోరుతూ కార్య క్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్,కోటి రామస్వరూప్ రాఘవాచార్య వైదిక ,పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

తొలిసారిగా పొగమంచు

భద్రాచలంలో ఆదివారం సీతారాముల కల్యాణం వీక్షించే భక్తుల కోసం జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్రంలోనే తొలిసారిగా పొగమంచు సౌకర్యంను అందుబాటులోకి తెచ్చింది. సుమారు లక్ష చదరపు అడుగుల్లో బోరు నుంచి నేరుగా ప్రత్యేక పైపులైన్‌తో 800 ఫాగర్స్‌తో(పొగమంచు వెదజల్లే పరికరాలు) ఏర్పాటు సెక్టార్లలో ఏర్పాటు చేశారు. 1.5 మీటర్ల వ్యాసార్థంలో ఇరువైపులా ఈ పొగమంచు ఎండ తీవ్రతను తగ్గించనుంది. గంటకు 1600 లీటర్ల నీరు వినియోగం కానుండగా ఎండ వేడిమిని బట్టి పొగమంచును సెక్టార్లలో వినియోగించనున్నారు.

అయోధ్యలా భద్రాద్రి అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం సిద్దమన్నారు. ఆలయ అభివృద్ధి పనులు ఆగమశాస్త్రమానుసారం పండితులతో చర్చించి వారి నిర్ణయం మేరకే చేపట్టడం జరుగుతుందన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖనిజ నిక్షేపాలకు కొదవ లేదని ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖనిజ నిక్షేపాలు అధికమన్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం కేంద్రంగా ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని సీఎంను కోరామని రెండు రోజుల్లో ఈ అనుమతులు రానున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. పాండురంగాపురం నుంచి మల్కనగిరికి రైల్వేలైను మంజూరైన క్రమంలో తొలి విడతగా పాండురంగాపురం నుంచి సారపాక(సాకేతపురి)కి 16 కి.మీ. రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

గతంలో ఇందుకు సంబంధించిన సర్వే జరిగిందని ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రైల్వేలైను ఏర్పాటు చేస్తే భద్రాద్రి రామాలయ, ఏజెన్సీ అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. అలాగే విమానాశ్రయం కొత్తగూడెంలో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఇప్పటికే ఆ శాఖ మంత్రిని కోరడం జరిగిందన్నారు. జలరవాణాకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని దీని వలన కాలుష్య నివారణతో పాటు తక్కువ ఖర్చుతో సరుకు రవాణా చేయవచ్చని తెలిపారు. జల రవాణ తన జీవిత ఆశయమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

ఇంకెంతకాలం కడతారు ఈ కరకట్ట...?

'మీకు నేను ఎన్నిసార్లు చెప్పాను....ఏం చేశారు, ఈ కరకట్ట ఇంకెంత కాలం కడతారు...గత ఏడాది వరదల సమయంలో నేను వచ్చినప్పుడు ఎలా ఉందో ఇప్పుడు అంతే ఉంది. ఇంకెప్పుడు పూర్తి చేస్తారు...' అంటూ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సీఈతో పాటు నీటిపారుదల శాఖ ఇంజనీరింగు అధికారులపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచలంలో శుక్రవారం కూనవరం రోడ్డులో చేపట్టిన మిగులు కరకట్ట పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. పనుల్లో ఏ మాత్రం వేగం లేకపోవడం అలసత్వం ప్రదర్శిస్తుండటం పట్ల తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలివేటెడ్ రోడ్డుకు సంబంధించిన డిజైన్లు ఆమోదంకు నోచుకోకపోవడంతో పనులు చేపట్టలేకపోయామని అధికారులు పేర్కొనడంతో సీడీవో సీఈతో ఫోన్లో మాట్లాడారు. డిజైన్ల ఆమోదంకు ఇంకెంత కాలం తీసుకుంటారు మీ వలనే ఆగింది అంటూ నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారని మంత్రి సీఈతో పేర్కొన్నారు. ఈ క్రమంలో వెంటనే డిజైన్లకు సంబంధించిన పనులకు ఆమోదం తెలిపి పనులను ప్రారంభించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. పనులు చేతకాకపోతే సంబంధిత ఏజెన్సీని తప్పుకోమనండి, పనులు కొత్తవారికి అప్పజెప్పండి. ఎట్టి పరిస్థితుల్లో మే 31 నాటికి కరకట్ట పనులు పూర్తి కావాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అనుకున్న సమయానికి కరకట్ట ఎత్తు పెంచాలని ఇతర పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. స్లూయిస్‌లకు ఆటోమెటిక్ షట్టర్లను ఏర్పాటు చేయాలని ఇందులో నిర్లక్ష్యం వహిస్తే నీటిపారుదల శాఖ ఇంజనీరింగు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కరకట్టను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

కాంగ్రెస్ నాయకుడికి గుండెపోటు

(5వ పేజీ తరువాయి)

కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు గుండె రక్తనాళాల్లో రెండు స్టెంట్‌లను అమర్చినట్లు తెలుస్తోండగా, పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. సుధాకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే అనంతరం మరో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. సీపీఆర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కాగా, డాక్టరు వెంకట్రావు సేవలకు పలువురు నెటిజన్లు, కాంగ్రెస్ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

పులకించిన జమలాపురం



స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి)

పాణిగ్రహణం గావించారు. ఆలయ సాంప్రదాయమైన రుగ్వేద, వైదిక, స్మార్త, ఆగమ శాస్త్రోక్తంగా అర్చకులు దివ్య కళ్యాణం నిర్వహించారు. భద్రాచలం సీతారామచంద్రసావమి ఆలయం నుంచి వచ్చిన ముత్యాల తలంబ్రాలను ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు శ్రీవారికి సమర్పించారు. శ్రీవారి దంపతులు తలంబ్రాలను శిరస్సున పోసుకునే సమయంలో భక్తులు ఆనంద పరవశంతో భావోద్వేగం చెందారు. ప్రముఖ ప్రవచన కర్త కపిలవాయి అచ్యుతరామారావు వేంకటేశ్వరుడి వైభవం, కళ్యాణ వాఖ్యానంతో భక్తులు మధురానుభూతిని చెందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు కళ్యాణ అక్షింతలు దివ్యప్రసాదంగా అందించారు. కుర్నవల్లి గ్రామానికి చెందిన శ్రీవారి భక్తుడు శీలం వెంకటరామిరెడ్డి భక్తులకు మహన్నదానం నిర్వహించారు. సాయంత్రం డప్పువాయిద్యాలు కోలాట నృత్యాలు, గరుడవాహనంపై శ్రీవారి దంపతులతో గ్రామసేవ నిర్వహించారు. కేఎస్‌ఆర్ గ్రానైట్స్ ఖమ్మం వారి ఆర్థిక సహకారంతో జమలాపురం పెద్దచెరువులో వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు.

విలేకరులకు పాస్‌లు జారీ చేస్తాం: తుమ్మల

భద్రాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం, పట్టాభిషేకానికి హాజరయ్యే విలేకరులకు జిల్లా యంత్రాంగం పాస్‌లు జారీ చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను ఆదేశించినట్లు తెలిపారు. దీంతో విలేకరులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
శనివారం 5 ఏప్రిల్ 2025
ఖమ్మం సిటీ ZONE 8
• ఖమ్మం • రఘునాథపాలెం • ఖమ్మం రూరల్ • తిరుమలాయపాలెం • కూసుమంచి • నేలకొండపల్లి • కామేపల్లి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



ఖమ్మంక్రైం,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):నగరంలోని టుటౌన్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన బి.పాష కుటుంబసభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం సీపీ సునీల్‌దత్ తన కార్యాలయంలో అందించారు. శాఖపరంగా సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని సీపీ తెలిపారు. భద్రతా ఎక్స్‌గ్రేషియా నుంచి ఈచెక్కు మంజూరైంది.



ఖమ్మం నగరంలోని పర్ణశాల రామాలయం

రామాలయాలు ముస్తాబు

రేపు సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

ఖమ్మం ఖానాపురంహవేలి,ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించేందుకు జిల్లాలోని ఆలయాలను ముస్తాబు చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో, పట్టణాలలోని ఆలయాలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులకు ప్రత్యేకంగా వేదికల వద్ద ఎండవేడిమి తగలకుండ షామియానా, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాలలో కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామాలలో ఊరేగింపులో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరిగే ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే రెండో అతిపెద్ద పర్ణశాల ఆలయంగా ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆలయంలో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా వసంత నవరాత్రి సహిత కల్యాణ మహోత్సవం జరిగేలా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, మంచినీళ్లు, క్యూలైన్లు ఏర్పాటు తో పాటు 6న జరిగే కల్యాణానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఊరేగింపులో డప్పు బృందాలు, కోలాట బృందాలు, భజన బృందాలు, నడుమ స్వామివారి ఊరేగింపు జరుగుంది. 7న స్వామి వారి పట్టాభిషేకం నిర్వహిస్తారు.నగరంలోని గాంధీచౌక్‌లో ఏటా సీతారాములు



విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

కల్యాణాన్ని ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. 6న జరిగే కల్యాణం రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

వివిధ రకాల రంగులతో విగ్రహాలు సిద్ధం

సీతారాముల కల్యాణానికి రకరకాల రంగులతో ఉన్న స్వామి వారి విగ్రహాలను సిద్ధం చేశారు. సీతారాములు కల్యాణాన్ని అధికంగా ఆలయాల ఆరుబైట నిర్వహిస్తారు. దీంతో కొన్ని ఆలయాల్లో స్వామి వారి విగ్రహాలు అందుబాటులో లేకపోవటంతో ఏటా తయారు చేసిన విగ్రహాలను కొనుగోలు చేసి కల్యాణం నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలోని ఇల్లెందు రోడ్డు, వైరారోడ్డు, సూర్యాపేట రోడ్డు, కోదాడ రోడ్లలో విగ్రహాలను విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు. ఒక్కోజత విగ్రహాలను(సీతా, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి) రూ.15 వందల నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ధరలు అధికంగానే ఉన్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు.

సకాలంలో నిధుల సద్వినియోగం

- ఆలస్యంగా మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు
- వెనువెంటనే ఎమ్మెల్సీ ఎన్నికలు
- యుద్ధప్రాతిపదికన వనరుల కార్యాచరణ చేసిన కమిషనర్







జటాయి వాహనాలు, డంపింగ్‌యార్డు రవాణా కోసం రూపుదిద్దుకుంటున్న రోడ్డు, డిజిటల్ బోర్డులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వ మంజూరు చేసిన నిధులు సకాలంలో వినియోగించారు.. ఫలితంగా శాశ్వత పనులతో పాటుగా వనరులను సమకూరాయి. ఆలస్యంగా నిధులు మంజూరు, వెనువెంటనే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంతో నిధులు టెండర్లు పిలిచేందుకు సాంకేతిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినా కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ చేశారు. కేఎంసీ అధికారులు తమ హోదాలను సైతం పక్కకు పెట్టి కిందిస్థాయిలోని ఉద్యోగుల వద్దకు వెళ్లి దస్త్రాలను త్వరగా క్లీయర్ చేశారు. ఫలితంగా అనేక పనుల నిర్మాణాలు పూర్తి చేశారు.

ఆలస్యంగా నిధులు

మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో ఉన్న జనాభాతో పాటుగా నగర పాలక సంస్థల పనితీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం గతేడాది 15వఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరు ఆలస్యంగా జరిగాయి. రెండు విడతలుగా జూన్, అక్టోబరులో నిధులు మంజూరు జరిగాయి. తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికలు రావటంతో 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించటానికి టెండర్లు పిలిచేందుకు సాంకేతిక కారణాలు అడ్డంకిగా ఏర్పడ్డాయి. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత వెంటనే ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిధులు వినియోగానికి కార్యచరణ చేశారు. మార్చి 31లోపుగా నిధులు వినియోగించారు.

సకాలంలో నిధులు సద్వినియోగం

ఖమ్మం నగరంలో ప్రధాన సమస్యగా ఉన్న పారిశుధ్యం, డంపింగ్, రవాణా సమస్యల పరిష్కారంపై కమిషనర్ దృష్టి సారించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనల మేరకు ఆయా రంగాలకు కేటాయించాలని కార్యచరణ చేసి అమలు చేశారు. కేవలం రెండు నెలల్లోనే రూ.6కోట్లు పనులు చేపట్టి నిధులు తిరిగి వెళ్లకుండా సద్వినియోగం చేశారు.

రూ.1.50 కోట్లతో డంపింగ్ రవాణా

1వ డివిజన్‌లో ఉన్న కేఎంసీ డంపింగ్‌యార్డుకు పారిశుధ్య వాహనాలు వెళ్లాలంటే సరైన రహదారి లేక పోవటంతో రవాణా ఇబ్బందులు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో వాహనాలు ఇరుక్కుపోయి తీవ్రఆటంకం ఏర్పడింది. దీంతో రూ.150 కోట్లతో ఖమ్మం నగరంలోని రెండు పడకల ఇళ్ల వద్ద నుంచి డంపింగ్‌యార్డు వరకు రోడ్డు నిర్మాణాలను చేపట్టారు.

రూ1.20 కోట్లతో రెండు వాహనాలు

ఒనగరంలోని ప్రధాన కూడళ్ల రహదారుల పైన చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు సమస్యగా మారాయి. అలాగే ప్రధాన రహదారుల వెంట కమర్షియల్ ప్రాంతాల్లో డ్రైనేజీలు మూసుకు పోయాయి వరద తీవ్రత రహదారిపైకి వచ్చి నివాసాలు, కమర్షియల్ ప్రాంతాల్లోకి వెళ్లంది. వాటి సమస్యను పరిష్కారం కోసం మహనగరాలకు దీటుగా రెండు జటాయు వాహనాలను రూ.120 కోట్లతో కొనుగోలు చేశారు.

రూ.1.20కోట్లతో పారిశుధ్య ట్రాక్టర్లు

పారిశుధ్య నిర్వహణకు ప్రైవేట్ వాహనాలపై ఆధార పడాల్సిన పరిస్థితి ఉంది. ప్రతీ నెల రూ.లక్షల్లో ప్రైవేట్ పారిశుధ్య వాహనాలకు కేఎంసీ నుంచి డబ్బులు చెల్లింపులు జరుగుతున్నాయి. పారిశుధ్య నిర్వహణకు కేఎంసీకి సొంతంగా 19ట్రాక్టర్లు రూ.120 కోట్లతో కొనుగోలు చేశారు.

రూ.54లక్షలతో నీటి ట్యాంకర్లు, ట్రాక్టర్లు

ఖమ్మం నగర పాలక సంస్థలో పలు అవసరాలకు నీటి సరఫరా కోసం ఎన్నో ఏళ్ల క్రితం ట్రాక్టర్, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. అవి శిథిలావస్థకు చేరటంతో ప్రైవేట్ వారి వద్ద నుంచి దాతల అందించిన ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతుంది. కేఎంసీకి రూ.54 లక్షలతో 5ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకులను కొనుగోలు చేశారు. రానున్న వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ట్రాక్టర్లు, ట్యాంకర్లు ఉపయోగపడనున్నాయి.

రూ.1.10 కోట్లతో స్వచ్ఛ ఆటోలు

ఇంటింటి చెత్తసేకరణలో పారిశుధ్య ఆటోలు కీలకంగా ఉన్నాయి. కేఎంసీకి సొంతంగా పూర్తి స్థాయిలో ఆటోలు లేక పోవటంతో ప్రైవేట్ వ్యక్తుల ద్వారా కొన్ని ప్రాంతాల చెత్త సేకరణ జరుగుతుంది. ఈ క్రమంలో కేఎంసీకి సొంతంగా స్వచ్ఛ ఆటోలు ఉండాలని 20స్వచ్ఛ ఆటోలను రూ.1.10 కోట్లతో కొనుగోలు చేశారు. స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్త సేకరణకు విడి విడిగా ట్రాలీలను నిర్మాణం చేశారు.

రూ. 1.55 కోట్లతో కేఎంసీకి మెకానిక్ షెడ్

ఖమ్మం నగర పాలక సంస్థకు 110 వాహనాలు ఉన్నాయి. అయినా వాటి నిర్వహణకు సొంతంగా షెడ్‌లేక పోవటంతో తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. రూ.155 కోట్లతో మెకానిక్ షెడ్ నిర్మాణం చేపట్టారు.


రూ.64 లక్షలతో డిజిటల్ బోర్డులు

నగర పాలక సంస్థకు అదనపు ఆదాయం రాబట్టేందుకు కేఎంసీ కమిషనర్ వినూత్నంగా ఆలోచించారు. హైదరాబాద్‌స్థాయిలో డిజిటల్ బోర్డులు వ్యాపార ప్రకటనలు అద్దెల కోసం నిర్మాణం చేపట్టారు.ప్రధాన కూడళ్లలో కేఎంసీ ఆధ్వర్యంలో ఒకసారి డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తే ఏటా కేఎంసీకి ఆదాయం వస్తుంది. డిజిటల్ బోర్డుల కోసం రూ.64 లక్షలతో నిర్మాణాలు ప్రారంభించారు. ఎన్టీఆర్ సర్కిల్, శ్రీశ్రీసర్కిల్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, లకారం సర్కిల్, జెడ్పీ సర్కిల్, పాత మున్సిపల్ కార్యాలయం,నూతన బస్టాండ్, కాల్వొడ్డు, గాంధీ చౌక్ సర్కిల్, చర్చికాంపౌండ్ సర్కిల్‌లో భారీడిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలు

ఖమ్మంలోని పలు కేంద్రాల్లో నిరుద్యోగులు, విద్యార్థులు కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను అభివృద్ధి చేశారు. వాటి కోసం రూ.34 లక్షల నిధులను వినియోగించారు.

నిధులు తిరిగి వెళ్లకుండా కార్యాచరణ చేశాం



అభిషేక్ అగస్త్య, కమిషనర్, ఖమ్మం నగర పాలక సంస్థ

15వ ఆర్థిక సంఘం నిధులు మార్చి 31లోపుగా వినియోగించాలి. ఖమ్మం నగరానికి మున్నేరు వరదలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సర్వేలు, లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాలు నిర్వీరామంగా కానసాగాయి. ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు, ఎల్ఆర్ఎస్ పనులు ఒకేసారి వచ్చాయి. అయినా యుద్ధ ప్రాతిపదికన అనేక పనులు చేపట్టాం. సుమారు రూ.6 కోట్ల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థకు పనులు పూర్తి చేశాం. త్వరలో వాటిని ప్రారంభిస్తాం.

దివ్యాంగులను ప్రోత్సహిస్తాం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధిపొందని దివ్యాంగులకు తగిన ప్రోత్సాహం అందిస్తూ, అర్హులైన వారికి తగిన సహాయ అందించడమే మిత్ర దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ముఖ్య ఉద్దేశమని ఆ ట్రస్టు ఛైర్మన్ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు శుక్రవారం ఖమ్మం నగరంలోని ట్రస్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. దివ్యాంగులు తమకున్న వైకల్య నిర్ధారణ పత్రాలు, చిరునామాను తెలపాలని కోరారు. అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేసి ట్రస్టు తరుపున తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849939108 నెంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదలోనే రూపుదిద్దుకుంటుందని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ పాఠశాల నయబజార్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరదలు కారణంగా దెబ్బతిన పాఠశాలను పలువురి దాతల సహాకారంతో అభివృద్ధి చేసిన ఉపాధ్యాయులను, పూర్వ విద్యార్థులను, దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం రైల్వే పోలీసుల పరిధిలోని బోనకల్ రైల్వే స్టేషన్ దగ్గర గుర్తుతెలియని (40)సంవత్సరాల వయస్సుగల ఓ వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ముదిగొండ పోలీస్‌ల పరిదిలో మున్నేరులో గుర్తుతెలియని యువకుడు మృతిచెంది పూర్తిగా కుళ్లిపోయిన దశలో పోలీసులు గుర్తించి మృతదేహాన్ని ఖమ్మం ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ రెండు మృతతదేహాలను పోలీసుల సమక్షంలో శవపరీక్ష నిర్వహించి అన్నం శ్రీనివాసరావుకు అప్పగించారు. బల్లేపల్లి వైకుంఠదామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సవరణల బిల్లుతో పెన్షనర్లకు ప్రమాదం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం త్వరలో తేనున్న పెన్షన్ సవరణల బిల్లుతో పెన్షనర్లకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుదని రాష్ట్రప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.శరత్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పెన్షన్ సవరణల బిల్లును వెంటనే ఉపసహరించాలన్నారు. లేనిచో పెన్షనర్లు ఉద్యమబాట పట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరమట్ల సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, ఉపేందర్‌రావు, సాంబశివరావు పాల్గొన్నారు.

కేఎంసీకి ఒకేరోజు రూ.81.50 లక్షల పన్ను వసూలు

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి27(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగర పాలక సంస్థ పన్ను వసూలులో సరికొత్త రికార్డును గురువారం నమోదు చేసుకొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌లో వడ్డీపై 90శాతం మాఫీని ప్రకటించింది. దీంతో ఒకే రోజు రూ.81.50 లక్షల ఆదాయ వసూళ్లు జరిగాయి. దీంతో కేఎంసీ ఆదాయం రూ.28 కోట్లకు చేరింది.

తీర్థాల, మారెమ్మ తల్లి ఆలయాలకు కమిటీల ఎంపిక

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయం, మారెమ్మతల్లి ఆలయానికి నూతన కమిటీలను నియమించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు ఈ కమిటీ ఎంపిక ప్రక్రియ జరిగింది. సంగమేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా భూక్యా రావోజీ, సభ్యులుగా బోజెడ్ల లలితమ్మ,బండారు సేవియాను నియమించారు. మారెమ్మతల్లి ఆలయ ఛైర్మన్‌గా తిప్పిరెడ్డి వీరారెడ్డి, సభ్యులుగా కుసుమ రాజారామలు, నాగండ్ల ఉపేందర్, భట్టు చలమయ్య, చీకటి శ్రీనివాస్‌రావు, వీర్ల వెంకటేష్, అజ్మీరా వెంకన్న, కందుల అబ్బిరెడ్డి, బాణోతు భాస్కర్, బి.కమలమ్మ, కీర్తి లక్ష్మీనారాయణ, దండి రామారావును ఎంపిక చేశారు. ఏడాది పాటు వీరు పదవిలో కొనసాగుతారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 46వ డివిజన్ పరిధిలోని జూబ్లీపుర అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్పోరేటర్ కన్నం వైష్ణవి పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మీ, సంధ్య, హెల్పర్లు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):శుక్రవారం పైనంపల్లి టోల్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాపాచారి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన పాపాచారి శ్రీనివాసనగర్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఖమ్మం నుంచి హుజూర్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, పైనంపల్లికి చెందిన వడ్డెం వెంకటయ్య మరో వాహనంపై వస్తూ ఢీకొట్టాడు. దీంతో పాపాచారి తీవ్రంగా గాయపడ్డాడు.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి దశాబ్దాల పాటు చాలీచాలని జీతాలతో పని చేసి వయసు పరిమితుల రీత్యా ఉద్యోగ విరమణ చేసిన మాకు జీవనం భారంగా మారిందని పలువురు విశ్రాంత ఉద్యోగులు అన్నారు. ఆర్టీసీ నుంచి మాకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలంటూ శుక్రవారం నగరంలోని డిపో మేనేజర్ కార్యాలయం ముందు, డిపో ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్, ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్లూమింగ్ మైండ్స్‌లో ఆడిటోరియాన్ని ప్రారంభించిన పొంగులేటి

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బ్లూమింగ్‌మైండ్స్ సెంట్రల్ పాఠశాల, కళాశాలలో శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆడిటోరియాన్ని ప్రాంభించారు. అనంతరం ఆడిటోరియంలో కొంతసేపు టెన్నిస్ ఆడారు. పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆడిటోరియంలో ఇండోర్ గేమ్స్‌లు టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్, మొదలగు క్రీడలు ఆడేందుకు అనుగుణంగా నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మెన్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ గౌతంరెడ్డి, ప్రిన్సి



ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

పాల్ కిరణ్‌కుమార్, ఒకటో డివిజన్ కార్పోరేటర్ తెజావత్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకుడు నాగటి ఉపేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

తిరుమలాయపాలెం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తహసీల్దార్ జి.సుధీర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించారు. తిరుమలాయపాలెంలో రేషన్‌కార్డులకోసం దరఖాస్తు చేసుకున్న వారిని సర్వేచేశారు. తెట్టెలపాడులో చౌకదుకాణాన్ని ఆయన పరిశీలించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని త్రీ టౌన్ ప్రాంతంలోని లబ్ధిదారులకు మేయర్ పునుకొల్లు నీరజ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి శుక్రవారం వీటిని పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతోనే సంక్షేమ పథకాలు రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మంలో అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. మాజీకార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, నాళం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఎప్‌సెట్ తరగతులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా ఎప్‌సెట్ కోచింగ్ అందిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు.శుక్రవారం బాలురు 50 మందికి, బాలికలు 50 మందికి ఉచిత కోచింగ్‌ను ప్రారంభించామని తెలిపారు. బాలురులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల)గాంధీచౌక్ ఖమ్మం, బాలికలకు బీఆర్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల ఖమ్మంలో ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు తెలిపారు.

ఐక్యతతోనే శాంతియుత వాతావరణం

మాజీ మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం మార్కెట్ , ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి); కులమతాలతో సంబంధం లేకుండా అందరూ ఐక్యతగా ఉంటేనే సమాజంలో శాంతి పూర్వక వాతావరణం ఉంటుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని షాదీఖానాలో జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నగరంలో ఉన్న అన్ని సామాజిక వర్గాలు, మతాలకు చెందిన ప్రజలు ఒకరితో ఒకరు స్నేహ పూర్వకంగా ఉండాలని హిందూ, ముస్లీంలు కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఇటీవల కొన్ని రాజకీయ పార్టీలు వారి పబ్బం గడుపుకోవడం, ఎన్నికల్లో గెలవడం కోసం కుల, మతాలలో ఘర్షణ వాతావరణం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బిల్లు వల్ల లాభం లేదని అది మతవిద్వేశాలు రెచ్చగొట్టేలా ఉందని పేర్కొన్నారు. ఇటీవల నగరంలో రంజాన్ పండుగ సందర్భంగా తన విషయంలో జరిగిన కొన్ని అవాంచనీయ సంఘటనలను తాను మరిచి పోయాననిఅని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,



సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు పాల్వంచ క్రిష్ణ, వలరాజు, నాగండ్ల కోటి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, ముస్లీం పెద్దలు అబ్దుల్ ఘని, జవాద్, ఖమర్ పాల్గొన్నారు.

మరో రెండు బార్లకు ఎక్సైజ్‌శాఖ నోటిఫికేషన్

ఈనెల 26వరకు దరఖాస్తులు స్వీకరణ

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): 2018లో పలు కారణాలతో మూతపడిన రెండు బార్లస్థానంలో తిరిగి బార్లు ఏర్పాటు చేసేందుకు జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీ కూరగాయల మార్కెట్‌కు సమీపంలో మరియు బల్లేపల్లిలోని విద్యానగర్ కాలనీ ప్రాంతంలో రెండో బార్ ఏర్పాటును ప్రకటించారు. ఒక్కో బార్‌కు ధర రూ.42లక్షలుగా ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్ణయించారు. శుక్రవారం నుంచి ఈనెల 26 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.సెలవు రోజుల్లో దరఖాస్తులు స్వీకరించబడవని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటుగా రూ.1లక్ష చలానా లేదా డీడీ మూడుకలర్ ఫొటోలు, స్వీయ ధ్రువీకరణ కలిగిన ఆధార్,పాన్ కార్డులు జత చేయాలని సూచించారు. ఈనెల29న ఉదయం 11 గంటలకు లాటరీ విధానం ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు.

42శాతం బీసీ రిజర్వేషన్ అభినందనీయం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయటం అభినందనీయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుపై అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు అమలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ఎప్పుడు పేదల పక్షాన పోరాడుతుందన్నారు. నాయకులు పుచ్చకాయల వీరభద్రం, లక్ష్మణ్; నూతి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

మధిరటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం మధిర ఆర్టీసీ డిపో ముందు ధర్నా నిర్వహించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్ బకాయిలను వెంటనే ఇవ్వాలని, తార్నాక ఆసుపత్రిలో రిటైర్డ్ ఉద్యోగులు అందరికీ కార్పొరేట్ వైద్యం అందించాలని కోరారు. ఈ మేరకు డిపో మేనేజర్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు భిక్షపతి, పకీరయ్య, వెంకటేశ్వర్లు, అప్పారావు, రమేష్ కుమార్, శ్రీను, కృష్ణారావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్నలు

మిర్చి, వరి పంటకు సైతం తీరని నష్టం

వైరా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైరాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు, కంకులు తడిసిపోయాయి. అలాగే పరిసర గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నలు, కొంత మిర్చి కూడా వర్షానికి తడిసిపోయాయి. భారీ ఈదురుగాలులతో ఒక్కసారిగా వైరాలో భారీ వర్షం కురిసింది. మార్కెట్‌యార్డులోని ఓపెన్ షెడ్లు, ఆరుబయట ఆరబోసిన మొక్కజొన్న కంకులు జల్లులకు తడిసిపోయాయి. కొంతమంది రైతులు ఆరబోసిన మొక్కజొన్న కంకులు, మొక్కజొన్నలపై టార్పాలిన్ పట్టాలు కప్పినప్పటికీ వర్షపు నీటితో అడుగుభాగంలో అవి తడిచిపోయాయి. గ్రామాల్లో కూడా కొంతమంది రైతులకు చెందిన మొక్కజొన్నలు కొంత మిర్చి తడిచి నష్టం వాటిల్లింది.



వైరాలో తడిసిన మొక్కజొన్నలను చూపిస్తున్న రైతు



కల్లూరులో ధాన్యాన్ని తిరగదోడుతున్న రైతులు

నేలవాలిన వరిపైరు

కల్లూరు: గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల ప్రభావంతో కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పక్వానికి వచ్చి కోతలకు సిద్ధంగా ఉన్న వరి పైరు నెలవాలగా, ఇంకాను పలు చోట్ల ధాన్యం రాశులపై, అడుగు భాగం వర్షపు నీరు చేరీయి. దీంతో ధాన్యం గింజలు తేమగా మారటంతో కల్లాల్లో రైతులు నానాఅగచాట్లు పడుతున్నారు. మండల పరిధిలోని కప్పలబందం, చంద్రుపట్ల, బత్తుపల్లి, కల్లూరులోని పుల్లయ్యబంజర వీధివైపున, తదితర గ్రామాల్లో ఆకాల వర్షం, ఈదురు గాలి రావటంతో సుమారు400 ఎకరాల్లో పక్వానికి వచ్చిన వరి పైరు నెల వాలింది. దీంతో యంత్రాలతో వరి కోతలకు సిద్ధంగా ఉన్న రైతులకు ఆర్థిక భారంగా మారనున్నది. రాశుల వద్ద వరద నీటితో ధాన్యం తేమగా మారింది. పలు రాశులపై కప్పిన టార్పన్లపై కూడ వరదనీరు చేరటంతో బాధిత రైతులు అరవేసే క్రమంలో తేమగా మారిన ధాన్యంను దంతెలతో తిరగదోడుతున్నారు. ఇలా కల్లాల వద్ద రైతులు నానా అగచాట్లు పడుతున్నారు.

వరి కోతలపై ఆర్థిక ప్రభావం..

ఆకాల వర్షం, ఈదురు గాలులతో వరిపైరు నేలవాలటంతో వరి కోతలకు అదనపు ఆర్థిక భారంగా మారిందని రైతులు అంటున్నారు. వాతవరణం పొడిగా ఉన్న సమయంలో పక్వానికి వచ్చిన వరిపైరు యంత్రాలతో కోయించేందుకు గాను సగటున ఎకరాకి గంట సమయం పడుతుంది. దీంతో అద్దె కిరాయి రూ. 3 వేలు కాగా, ఆకాల వర్షంతో వరిపైరు నెలవాలంటంతో అదే యంత్రంతో వరి కోతకు గాను ఎకరానికి రెండు గంటలు సమయం పడుతుండగా అద్దె రూ.6 వేలు అవుతుందని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. వరి పంట ఈదురు గాలికి నేలకు తాకటంతో మడులలో నీరు చేరి బురదగా ఉండటంతో వరి కోత యంత్రాలు పనిచేయటానికి అంతరాయం కలుగుతుందని బాధిత రైతులు చెప్తున్నారు. పక్వానికి వచ్చిన వరిపైరు గింజలు పొడిగా మారి నేలరాలే అవకాశం ఉండటంతో ఆర్థిక భారంగా మారిన రైతులు యంత్రాలతో వరి కోతలు కోయిస్తున్నారు. ఇప్పటికైన వాతరవరణం పొడిగా మారి ఎండలు కాస్తే రైతులకు పెద్దగా నష్టం ఉండదు.

మిర్చి, వరిపంటలకు నష్టం

పెనుబల్లి: పెనుబల్లి మండలంలో గురువారం రాత్రి అకాలంగా కురిసిన భారీ వర్షానికి మిర్చి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి ఒక్కసారిగా వర్షం కురవడంతో మండాలపాడు, ఉప్పలచిలక, లింగగూడెం మొంగికుంట, చౌడవరం, ఏరుగట్ల, కారాయిగూడెం, బయ్యన్నగూడెం తదితర గ్రామాల్లో ఆరబెట్టిన మిర్చి తడిచిపోయింది. దీంతో మిర్చి తడిచిపోయిందని రైతులు వాపోతున్నారు. అలాగే సూరయ్యబంజర్, కోంద్రుపాడు, గణేశులపాడు, కుప్పెనకుంట్ల గ్రామాల్లో అకాల వర్షానికి వరిపైరు నేలకొరిగింది. కొన్ని గ్రామాల్లో కోసి ఆరబెట్టిన వరిధాన్యం కూడా తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటలకు నష్టం

తల్లాడ: తల్లాడ మండలంలో గురువారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి పంటకు నష్టం వాటిల్లింది. భారీ వర్షం వల్ల కోతకు వచ్చిన దాల్వా వరి నేలకొరిగింది. మామిడిచెట్లకు ఉన్న కాయలు నేలరాలాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యం కొంతమేర తడిచింది.



పెనుబల్లి బండలం మండాలపాడులో మిర్చిని ఆరబెడుతున్న దృశ్యం



తల్లాడలో నేలవాలిన వరిపైరు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న రాయల

ముదిగొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. ముదిగొండ మండలం వల్లభిలో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కోరారు. ప్రభుత్వం సన్నరకం వరి పండించిన రైతులకు రూ.500బోనస్ ఇస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొని గిట్టుబాటు ధరతోపాటు రూ.500బోనస్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, ఏపీఎం కల్పన, మాజీ ఎంపీటీసీ బిచ్చాల బిక్షం, ఎల్లయ్య, అన్వేష్, పుల్లారెడ్డి, భాస్కర్, రాఘవ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

బోనకల్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): కర్షుడి చావుకి సవలక్ష కారణాలు అన్నట్లుగా అన్నదాతలకు కష్టాలు పరిపాటిగా మారాయి. సరిగ్గా పంట చేతికందే తరుణంలో ఒక్కసారిగా మారిన వాతావరణ పరిస్థితులతో మక్క రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరోవైపు పండించిన పంటకు సంబంధించి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం వారికి నష్టం కలిగిస్తుంది. ప్రభు త్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించినా, జిల్లా అ ధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చినప్పటికి సొసైటీలకు మాత్రం సర్క్యూలర్లు రాకపోవడంతో ప్రభుత్వం నుంచి కొనుగోళ్లు ఇంకా మం డలంలో ప్రారంభం కాలేదు. పత్తి సాగులో చవి చూసిన నష్టాల నుంచి గట్టెక్కేందుకు గానూ మక్క సాగు చేసి అధిక దిగుబడులను సాధించారు. ఎకరానికి 30 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం కంకి పట్టించి కల్లాల్లో మక్కలను ఆరబోసి అమ్మకాలకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం కల్లాల్లో మక్కలను క్వింటాను రూ. 2050 నుంచి 2070 వరకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు సరాసరి రూ. 170 రూపాయల వరకు నష్టపోతున్నారు. వర్షపు జల్లులు పడుతుండటం మక్క రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. ఏ మాత్రం జల్లులు గింజలపై పడినా తడి వలన వెంటనే బూజు వస్తుంది. దీంతో రాత్రి వేళల్లో కూడ కలాల్లో తమ పంటను కాపాడుకునేందుకు పహారా కాస్తున్నారు. పట్టాలు కప్పడం వాటిని తీసి గింజలను తిరగేస్తుండటం వారికి కత్తి మీద సాములా మారింది.

మారిన వాతావరణంతో అమ్మకాలు షురూ

మారిన వాతావరణ పరిస్థితుల వలన రైతులు కల్లాల్లో ఆరబోసిన మక్కలను వెంటనే అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో ధర తక్కువైనా పర్వాలేదు కాని ఈ కష్టాలు పడలేమని ప్రైవేటు వ్యాపారులకు మక్కలను విక్రయిస్తున్నారు. సన్నకారు నుంచి పెద్ద రైతుల వరకు అమ్మకాలకే మొగ్గు చూపుతుండటంతో ఒక్కొక్కరు ఆర్థికంగా తప్పక నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



మక్కలపై పట్టాలు కప్పిన రైతులు

9న బైక్ ర్యాలీ

వైరా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హరించబడుతున్న కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న టీయూసీఐ జిల్లా మహాసభలను పురస్కరించుకొని ఈనెల 9న వైరాలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని ఆసంఘం జిల్లా కార్యదర్శి జి.రామయ్య తెలిపారు. ఈ నెల 13న వైరాలో జరిగే టీయూసీఐ జిల్లా మహాసభల దృష్ట్యా ఈ బైక్ ర్యాలీ ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం వైరాలో జరిగిన సమావేశంలో రామయ్య మాట్లాడారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను టీయూసీఐ నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాడుతుందన్నారు. ఈ క్రమంలోనే జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం సహా పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో యలదండి బాబు, సీవై.పుల్లయ్య, కె.అర్జున్‌రావు, పాశం అప్పారావు, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల దరఖాస్తులపై విచారణ

బోనకల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం రేషన్ కార్డుల దరఖాస్తులపై తహసీల్దార్ పున్నం చందర్, గిర్దావర్ నవీన్ కుమార్‌లు విచారణ నిర్వహించారు. మండలంలో మొత్తం 2988 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా మండలంలోని 22 గ్రామాల్లో విచారణను ప్రారంభించినట్లు తహసీల్దార్ తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక యాప్ ద్వార అన్ని వివరాలను సేకరించి అర్హులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు.

రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి

మధిరటౌన్,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): రైలు నుండి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మధిర-తొండలగోపవరం రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం సాయంత్రం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణగోపాల రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధిర-తొండలగోపవరం రైల్వే స్టేషన్ ల మధ్య డౌన్ లైన్ లో గుర్తు తెలియన రైలు నుండి ఓ వ్యక్తి జారిపడిన సమాచారం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకోగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడని తెలిపారు. అతని జేబులో లబించిన వివరాల ప్రకారం మృతుడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురజాల పట్టణానికి చెందిన గడ్డం ఉమామహేశ్వరావు(45) గా తెలిసిందని, మృతదేహాన్ని శవపరిక్ష నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిటం జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశ పెట్టాలి

బోనకల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశ పెట్టాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన ఆ సంఘ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలంటే ప్రభుత్వం ముందుగా ప్రీ ప్రైమరీ విద్య పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు చిన రంగారావు, సదాబాబు, నరసింహారావు, సౌభాగ్యలక్ష్మీ, వెంకటేశ్వర్లు, నిర్మలకుమారి, గంగాభవాని, నరేంద్రసింహా తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం బియ్యం పంపిణీ ప్రారంభం

కల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో శుక్రవారం స్థానిక చౌక దుకాణంలో సన్నరకం బియ్యం పంపిణీని కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరజదేవి మాట్లాడుతూ సన్నరకం బియ్యం పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న గొప్ప అవకాశం అన్నారు. నిరుపేదలందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, కాంగ్రెస్ నాయకులు కాటంనేని బాబురావు, ఏఎంసి డైరెక్టర్ లింగబోయిన పుల్లారావు, పరిగడపు రాము, పి బాబురావు, రామ నరిసింహారావు, దుగ్గిరాల సీతారాములు, జగదీష్, పి పుల్లారావు, జినుగు విజయదాసు చౌక దుకాణాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో రూపా, సొసైటీ వైస్ చైర్మన్ తోట కనకరావు, పాలకవర్గ సభ్యులు ఇంటి శివకృష్ణ, కనకం సాంబశివరావు, కనమతరెడ్డి రమేష్‌రెడ్డి, నామ మైసయ్య, మందడపు శ్రీలత, యాసా నాగేశ్వరరావు, సీతరామా రాజు, రామారావు, నరిసింహారావు, రాణెమ్మ, సీఈవో వేలాద్రి పాల్గొన్నారు.

అభివృద్ధి మా బాధ్యత: ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మమ్మల్ని గెలిపించిన మీ గ్రామ అభివృద్ధి బాధ్యత మాదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ.4.87కోట్ల పనులకు సంబంధించి సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలకు ప్రారంభోత్సవంతో పాటు శంకుస్థాపనలు చేశారు. గ్రామంలోని గాంధీజీ విగ్రహం నుంచి పీడబ్ల్యూడీ రోడ్డు వరకు ప్రత్యామ్నాయ బీటీ రహదారి, ఎస్సీ కాలనీ హరిజనవాడ నుంచి దీపకుంట చెరువు వరకు బీటీ రోడ్డుకు రిటైనింగ్ వాల్‌తో నిర్మాణం, కనస్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్ఆర్) ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీర్థాల, మారెమ్మ తల్లి

ఆలయాలకు కమిటీల ఎంపిక

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయం, మారెమ్మతల్లి ఆలయానికి నూతన కమిటీలను నియమించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు ఈ కమిటీ ఎంపిక ప్రక్రియ జరిగింది. సంగమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా భూక్యా రావోజీ, సభ్యులుగా బోజెడ్ల లలితమ్మ,బండారు సేవియాను నియమించారు. మారెమ్మతల్లి ఆలయ చైర్మన్‌గా తిప్పిరెడ్డి వీరారెడ్డి, సభ్యులుగా కుసుమ రాజారాములు, నాగండ్ల ఉపేందర్, భట్టు చలమయ్య, చీకటి శ్రీనివాస్‌రావు, వీర్ల వెంకటేష్, అజ్మీరా వెంకన్న, కందుల అబ్బిరెడ్డి, బాణోతు భాస్కర్, బి.కమలమ్మ, కీర్తి లక్ష్మీనారాయణ, దండి రామారావును ఎంపిక చేశారు. ఏడాది పాటు వీరు పదవిలో కొనసాగుతారు.

నవమికి ముస్తాబైన కోదండ రామాలయం



నారాయణపురంలోని కోదండ రామాలయం

తల్లాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలకు తల్లాడ మండలంలోని నారాయణపురం కోదండ రామాలయం ముస్తాబైంది. రామాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దాతల సహకారంతో ఆలయాన్ని నూతన హంగులతో ముస్తాబు చేశారు. ఈ దేవాలయాన్ని 1957 వ సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన రెడ్డెం నారాయణరెడ్డి నిర్మించారు. ప్రస్తుతం వారి మనుమళ్లు నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఆలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆలయం చుట్టూ సోలార్ ఏర్పాటు, రేకుల షెడ్, టైల్స్ ఏర్పాటుచేశారు. దేవాలయానికి రంగులు వేశారు. ఆలయ పూజారి వికనాసచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామనవమి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

మైనార్టీల హక్కులకు ముప్పుగా వక్ఫ్‌బోర్డు బిల్లు

సత్తుపల్లిలో ముస్లింల భారీ ప్రదర్శన

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల హక్కులకు ముప్పుగా వక్ఫ్‌బోర్డు బిల్లుకు ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకమని, ఈ సవరణలు ముస్లీంలను మాత్రమే కాకుండా ఇతర మైనార్టీ వర్గాలను కూడా ప్రభావితం చేస్తాయని ముస్లీం మతపెద్దలు అన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో జామే మసీదు, పట్టణ ముస్లీంల ఆధ్వర్యంలో మైనారిటీ సంఘాలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన తెలుపుతూ తహసీల్దార్ కార్యాలయానికి చేరకుని నాయబ్ తహసీల్దార్ శివకు వినతిపత్రం అందజేశారు. నరేంద్ర మోదీ పాలనలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విస్మరించారని, రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ సవరణ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ ముస్లీంలు అంగీకరించరన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, టీడీపీ, జనసేన మినహా అన్ని పార్టీల మద్దతు తమకు ఉందని, ఆ పార్టీలకే తాము ప్రాధాన్యతను ఇస్తూ భవిష్యత్తులో కార్యాచరణ ఉంటుందని స్పష్టంచేశారు. కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి ముస్లీం లోకానికి న్యాయం చేయాలని, లేదంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జామె మసీద్ సదర్ నాయబ్‌రసూల్, ఎండీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, రావుల రాజబాబు, గ్రాండ్ మౌలాలీ, ఎస్‌కే.రఫీ, రియాజుద్దీన్, ఆదిల్‌షరీఫ్, ముస్తఫా, యూనిస్, వలీ, ఫైమద్, బుడేన్, జియా, ఆబీద్, జాకీర్, ముజమ్మిల్, వాహిద్, రఫీ, ముజాఫర్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న ముస్లింలు



వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లింలు

చప్టాపై లోకాయుక్తకు ఫిర్యాదు

టీడీపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ ఎంపీపీ వరలక్ష్మి

ఏన్కూరు, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేట గ్రామ సమీపంలోని ప్రమాదకరంగా ఉన్న చప్టాకు రెండేళ్ల నుంచి ఫిర్యాదు చేస్తున్నా శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల అధికారులతీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకురాలు, మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి లోకాయుక్తకు ఫిర్యాదు చేయన్నునట్టు తెలిపారు. శుక్రవారం ఆమె ఏన్కూరులో విలేకరులతో మాట్లడుతూ చప్టా ఏ క్షణాన్నైనా కూలి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా ఉన్న చప్టా గురించి మే 2023న గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా మే 20,2023న జిల్లా కలెక్టర్ పరిశీలించి రూ.1.40కోట్లు ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో పనులు జరగలేదని ఆరోపించారు. రెండేళ్ల నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి 27న మళ్లీగ్రీవెన్సులో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో లోకాయుక్తకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. ఈ రహదారిపై ఖమ్మం, ఇల్లెందుకు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తూ, ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కిష్టారం రామాలయంలో మువ్వా పూజలు



పూజలో పాల్గొన్న మువ్వా విజయ్‌బాబు

సత్తుపల్లి, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టారంలోని 60వసంతాలు పూర్తి చేసుకున్న కోదండ రామాలయంలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మువ్వాను సాదరంగా ఆలయంలోకి ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.